

## గ్రామాల అభివృద్ధికి అధికారులు
# సమన్వయంతో పని చేయాలి

3 లో..

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నల్లగొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
శుక్రవారం 7-8-2026 www.prajajyothinews.com పేజీలు : 8



# చేప పిల్లలు రెడీ..

**నల్గొండ,, ఆగస్టు 6:**
మత్స్యకారుల ఉపాధికి దోహదపడుతున్న ఉచిత చేపపిల్లల పంపిణీ ప్రక్రియపై ఎల్‌నినో ఎఫెక్ట్‌తో ఈసారి నీలినీడలు కమ్ముకున్నాయని మత్స్యకారులు భావించారు. వానాకాలం మొదలై రెండు నెలలు గడిచినా సమృద్ధిగా వర్షాలు లేకపోవడంతో ఉచిత చేపపిల్లల పథకంపై అనుమానాలు వ్యక్తం అవుతున్న క్రమంలో ప్రభుత్వం చేపపిల్లల సరఫరాకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో మత్స్యకారుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టులు, చెరువుల్లోకి నీరు చేరుతోంది. టెండర్ల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం కావాల్సి ఉన్నా కొంత ఆలస్యంగానైనా టెండర్ ప్రక్రియ ప్రారంభించడానికి మత్స్యశాఖ కసరత్తు ప్రారంభించడంతో ఈసారి మత్స్యకారులకు ఉపాధికి ఇబ్బంది లేదని భావిస్తున్నారు.



# ఉత్తమ్ ఆశలకు తూట్లు

**- రూ.1,648 కోట్ల మహాత్మా గాంధీ లిఫ్ట్ పనుల్లో నాణ్యతపై అనుమానాలు - వర్షాలకు బయటపడిన పైపు లైన్**
**- పైపుల్లోకి వెళ్ళిన మట్టి.. బురద - నాణ్యత లోపాలు సరి చేస్తామన్న ఈఈ సత్యనారాయణ**

**చింతలపాలెం, ఆగస్టు 6 (ప్రజా జ్యోతి):** నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని వెల్లటూరు వద్ద కృష్ణానదిపై రూ. 1,648 కోట్ల...

6 లో..



## తెలంగాణ ఉద్యమ యోధులు జయశంకర్ ,గద్దర్‌ల
# సేవలు మరువలేనివి

- జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతి సందర్భంగా చిత్రపటాలకు పూలమాలవేసి ఘన నివాళులు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

మిగతా 10లో...

# ఘనంగా తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు

**ఆయన ఆశయాలు, విలువలు నేటి తరానికి ఆదర్శం-జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**



**నల్గొండ ఆగస్టు 6,(ప్రజా జ్యోతి ):** తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త, ఆర్థికవేత్త, ఉద్యమకారుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారి జయంతి సందర్భంగా నల్గొండ జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది రెండు నిమిషాల మౌనం పాటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ గారని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, ప్రాంతీయ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్కరూ ఆయన విలువలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రమేష్,ఏ.ఓ శివ ప్రసాద్,ఎస్బి డిఎస్పీ మల్లారెడ్డి, ఏ.ఆర్ డిఎస్పీ శ్రీనివాసులు, సీఐ లు,ఆర్.ఐ లు , మినిస్టీరియల్ సిబ్బంది,మహిళా పోలీసు సిబ్బంది,మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణలో రాజకీయ పార్టీల సహకారం కీలకం

**-ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలి**

**-సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట కలెక్టరేట్ ఆగస్టు 06(ప్రజాజ్యోతి):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో,తప్పుల్లేకుండా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు, జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడడం అందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. షెడ్యూల్ ప్రకారం జూలై 24తో ముగియాల్సిన బీఎల్ఓల ఇంటింటి సర్వేను క్షేత్రస్థాయిలో మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు ఆగస్టు 10 వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్యూమరేషన్ ప్రక్రియ వంద శాతం పూర్తైందని, సేకరించిన వివరాల డిజిటలైజేషన్ కూడా పూర్తయిందని చెప్పారు. ఓటర్ల జాబితాలో ఒకే వ్యక్తి పేరు రెండుసార్లు నమోదు కావడం, మరణించిన వారి పేర్లు కొనసాగడం వంటి పొరపాట్లు జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు),బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) పరస్పర సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను ధ్రువీకరించాలని సూచించారు. 2026 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే యువతీ యువకులందరూ ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై కూడా రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. ఓటర్లు తమ వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, ఓటర్ల జాబితా ప్రక్షాళనలో అన్ని రాజకీయ పార్టీలు అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.హరిసింగ్,జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్‌రాజ్,సి సెక్షన్ సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ తరపున సీహెచ్ రాజేశ్వరరావు,బీజేపీ తరపున చల్లమల్ల నరసింహ,ఎండి హాబిద్,బీఎస్పీ తరపున ఎం.స్టాలిన్,బీఆర్ఎస్ తరపున కరుణాకర్ రెడ్డి,వైఎస్సార్‌సీపీ తరపున డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్సీని వెంటనే అమలు చేయాలి- తపస్



**తుంగతుర్తి, ఆగస్టు 6,(ప్రజా జ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు నూతన పీఆర్సీని వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయుఎస్) జిల్లా అధ్యక్షులు యామా రమేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పర్వతం సంధ్యారాణి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలోని తపస్ సభ్యత్వ అభియాన్ లో భాగంగా మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వెలుగు పల్లి, తుంగతుర్తి తదితర గ్రామాల్లోని పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలను సందర్శించి ఆయా ఉపాధ్యాయులకు తపస్ సభ్యత్వాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పెండింగ్ లో ఉన్న 6 డి ఏ లను వెంటనే ప్రకటించి నూతన పి ఆర్ సి ని అమలు చేయాలని, అదేవిధంగా పెండింగ్లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని, సి పి ఎస్ ను రద్దు చేసి ఓ పి ఎస్ అమలు చేయాలని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని కేజీబీవీ సిఆర్టీలకు మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జూలకంటి వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఏలే గోవర్ధన్, జిల్లా బాధ్యులు పల్స చంద్రకళ మరియు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సమస్యలకు నిలయాలుగా ప్రభుత్వ హాస్టల్స్ ఏఐఎస్ఎఫ్



**నాంపల్లి, ఆగస్టు, 06(ప్రజా జ్యోతి ):** మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్ ని ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించి సర్వే చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ హాస్టల్స్ పై సవితి తల్లి ప్రేమ చూపిస్తుందని, నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుందని ఆరోపించారు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్న విద్యార్థులకు రావాల్సిన దుప్పట్లు, పెట్టెలు, ప్లేట్లు, నోట్ బుక్స్,దుస్తులు ఇవ్వడం లేదని, హాస్టల్స్ లో మరుగుదొడ్లు, స్నానపు గదులు, దీనివలన విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, భవనాలను వెంటనే రిపేర్ చేయాలని,ప్రభుత్వం చెప్పే మాటలు, చేతలకు పొంతన లేదని విమర్శించారు. విద్యార్థుల సమస్యలు పట్టించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# వాహనం స్వాధీనం 10 లీటర్ల సారా సీజ్



**పాలకవీడు, ఆగస్టు 6(ప్రజా జ్యోతి ):** హుజూర్నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి లో పాలకీడు మండలం జానపాడు గ్రామ శివారు లో మహంకాళి గూడెం కు చెందిన బనావత్ లక్ష్మయ్య అను వ్యక్తి తన హోండా ఆక్టివావాహనం పై సారా ను తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారి దివ్య ఆధ్వర్యం లో వాహనం ను సీజ్ చేసి 10 లీటర్ల సారా ను స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తి పై కేసు నమోదు చేయడమైనది. ఇట్టి దాడులలో ఎస్ ఐ దివ్య ,సిబ్బంది సిద్ధి నాగరాజు రమణ, లు డ్రైవర్ నరేష్ పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ కు ఆకాంక్ష విద్యార్థి ఎంపిక



**హాలియా,ఆగస్టు6(ప్రజా జ్యోతి):** పరుగెత్తే పాదాలకు అలుపెరగని పట్టుదల తోడైతే విజయం వరిస్తుందని నల్లగొండ జిల్లా అథ్లెటిక్ ఛాంపియన్ షిప్‌లో నిరూపించాడు. ఆకాంక్ష ఉన్నత పాఠశాల విద్యార్థి ఆర్.పవన్ కుమార్. జులై 26న మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 600 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకొని జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ మోదాల రవీందర్ గురువారం తెలిపారు. ఈనెల 6, 7 తేదీలలో హనుమకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ కు ఎంపికైనాడు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి విజయకేతనం ఎగురవేయాలని కొనియాడారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు,జిల్లాకు ఖ్యాతి తీసుకువచ్చిన పవన్ కుమార్‌ను కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్ రావు,డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు,క్రీడల్లో విద్యార్థిని తీర్చిదిద్దిన పీఈటీ ఆవుల చంద్రశేఖర్ ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

## జయశంకర్ ఆశయాల సాధనకు యువత కృషి చేయాలి

**- సర్పంచ్ దున్నా శ్రీనివాస్**



**నడిగూడెం, ఆగస్టు 6, ప్రజా జ్యోతి:**
తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సర్పంచ్ దున్నా శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జయశంకర్ ఆశయాల సాధనకు యువత ముందుండి పనిచేయాలని, తెలంగాణ లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, ఏఎన్ఎంలు రాధా, సుజాత, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, జూనియర్ అసిస్టెంట్ వంశీ, గ్రామస్తుడు జలీల్ అహ్మద్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు ఎరువులు విక్రయించే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



**దేవరకొండ, ఆగస్టు 6,(ప్రజా జ్యోతి):.**
వ్యవసాయ సీజన్‌లో రైతులకు విక్రయించే ఎరువులను గరిష్ఠ చిల్లర ధర ఎం ఆర్ పీ కంటే ఎక్కువ ధరలకు అమ్ముతున్న వ్యాపారులపై సంబంధిత అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.ప్రస్తుత సాగు సీజన్‌లో ఎరువులకు ఉన్న డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలు వసూలు చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. దీనివల్ల పెట్టుబడి వ్యయం పెరిగి రైతులపై తీవ్ర అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రధాన డిమాండ్లు తక్షణ తనిఖీలు వ్యవసాయ శాఖ అధికారులు ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి.ధరల పట్టికలు ప్రతి విక్రయ కేంద్రంలో ఎరువుల నిల్వలు, వాటి ఎంఆర్పీ ధరల పట్టికను రైతులకు కనిపించేలా స్పష్టంగా ప్రదర్శించాలి.లైసెన్స్ రద్దు: ఎం ఆర్ పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువ వసూలు చేసినా సదరు దుకాణాల లైసెన్సులను రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.ఈ విషయమై వ్యవసాయ, ఎరువుల నియంత్రణ శాఖ అధికారులు స్పందిస్తూ.. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. ఎక్కడైనా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే రైతులు వెంటనే తమకు ఫిర్యాదు చేయవచ్చని, అటువంటి దుకాణాలపై తక్షణమే తనిఖీలు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు..

## విద్యార్థుల అభ్యాసానికి తోడ్పాటుగా తూర్పుగూడెం పాఠశాలలో విజ్ఞాన చిత్రాల ఏర్పాటు

**- రూ.10 వేల సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన గనగాని రాజు శాలువాతో ఘన సన్మానం**

**తుంగతుర్తి, ఆగస్టు 6,(ప్రజా జ్యోతి):**
మండల పరిధిలోని తూర్పుగూడెం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యాసాన్ని మరింత ఆసక్తికరంగా, సులభతరం చేయాలనే లక్ష్యంతో గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు గనగాని రాజు తన సొంత ఖర్చుతో దాదాపు రూ.10 వేల వ్యయంతో ప్రతి తరగతి గదిలో విజ్ఞాన చిత్రాలను ఏర్పాటు చేయించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేణుక శ్రీనివాస్, ఉపసర్పంచ్ కన్నెబోయిన కళ్యాణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకన్న, గ్రామస్తులు పోలేపాక రామచంద్రు,గునిగంటి యాదగిరి, గుండగాని రమేష్, గుండ్ల వెంకన్న, వార్డు సభ్యులు, పాల్గొని గనగాని రాజు సేవలను అభినందిస్తూ శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ...విద్యార్థుల జీవితంలో ప్రాథమిక విద్య ఎంతో కీలకమైందని, చిన్నప్పటి నుంచే విజ్ఞానాన్ని పెంపొందించే వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి



బాధ్యత అని అన్నారు. తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన విజ్ఞాన చిత్రాలు విద్యార్థులలో నేర్చుకునే ఆసక్తిని పెంచడంతో పాటు బోధనను మరింత సులభతరం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## గ్రామాల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలి

**- ఎమ్మెల్యే బి ఎల్ ఆర్**

**- ఎమ్మెల్సీ తో కలిసి పలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో  పాల్గొన్న ఎమ్మెల్యే**



**మిర్యాలగూడ,ఆగస్టు 06,( ప్రజాజ్యోతి ):**
గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బి ఎల్ ఆర్) అన్నారు.గురువారం మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలోని దామరచర్ల, మిర్యాలగూడ, వేములపల్లి మండలాలలో నిర్వహించినగ్రామపంచాయతీ అభివృద్ధి మరియు సామర్థ్య వృద్ధి కార్యక్రమాలపై జరిగిన మండల ప్రజా పరిషత్ సమీక్షా సమావేశాలలోఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలు గ్రామాభివృద్ధికి మూలస్తంభాలుగా నిలవాలంటే అన్ని శాఖల అధికారులు పరస్పరసమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, పచ్చదనం పెంపు, ప్రజలకు మెరుగైనసేవలందించడం వంటి అంశాలపై ప్రత్యేకదృష్టి సారించా లని అధికారులకు సూచించారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు గ్రామపంచాయతీల పరిపాలనాసామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు.ప్రజా సమస్యలనుఎప్పటికప్పుడు గుర్తించి వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి గ్రామం అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలని సూచించారు.ఈ సమీక్షా సమావేశాల్లో సంబంధిత మండలాల ఎంపిడిఓ లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## మహీంద్రా కంపెనీ ట్రాక్టర్ నీటిలో ట్రయల్స్



**నాగారం ఆగస్టు 06 ప్రజా జ్యోతి:**
నాగారం మండల పరిధిలోని పేర బోయిన గూడెం బిక్కేరు వాగులో గురువారం మహీంద్రా ట్రాక్టర్ కంపెనీ ఆద్వర్యం లో ట్రాక్టర్ ను నీటిలో మూడు గంటల పాటు ముంచి ట్రయల్స్ ను నిర్వహించారు.ఈ సందర్భంగా కంపెనీ యాజమాన్యం మాట్లాడుతూ ట్రాక్టర్ ఇంజన్ ఆన్ చేసి నీటిలో ఉంచి ఇంజన్ సామర్ధ్యం ను పరీక్షించడం ట్రయల్స్ ముఖ్య ఉద్దేశం అని అన్నారు.మహీంద్రా ట్రాక్టర్ ఎప్పటికీ రైతుకు అందుబాటులో ఉండే విధంగా సరసమైన ధరలను నిర్ణయించడం జరుగుతుంది అని అన్నారు.ట్రయల్ ను చిత్రీకరించడానికి డిల్లీ హర్యానా నుండి 100 మంది యూట్యూబర్లు రావడం విశేషం.ఈ కార్యక్రమం లో మహీంద్ర కంపెనీ తిరుమలగిరి బ్రాంచ్ మేనేజ్ వెంకన్న సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలు సాధించాలి

**- ఇంటర్ విద్యార్థులకు ఉచిత రాత పుస్తకాల పంపిణీ**

**-కళాశాల అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని హామీ**



**నడిగూడెం, ఆగస్టు 6 (ప్రజా జ్యోతి):** ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న ఉచిత విద్యా సౌకర్యాలు, మౌలిక వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో విజయాలు సాధించాలని నడిగూడెం సర్పంచ్ దున్న శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా మంజూరు చేసిన రాత పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, తాను ఈ కళాశాల పూర్వ విద్యార్థినని, కళాశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. కళాశాలలో మౌలిక వసతుల అభివృద్ధికి తమ పాలకవర్గం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. కళాశాలకు ప్రహరీ గోడ, సీసీ రోడ్డు, విద్యార్థుల వసతిగృహం వంటి సౌకర్యాల కల్పన కోసం స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి. విజయ నాయక్, అధ్యాపకులు శ్రీధర్, కృష్ణ, మహేష్, ఉపేందర్, శ్రీనివాస్, డి. శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ సుజాతతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**-టీయుడబ్ల్యూజే 143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్**



**నాంపల్లి, 06(ప్రజా జ్యోతి ):** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు క్యాష్ లెస్ ఇన్సూరెన్స్ సౌకర్యం తరహాలోనే వర్కింగ్ జర్నలిస్టులందరికీ క్యాష్ లెస్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తే రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి పాలాభిషేకం చేస్తామని, జర్నలిస్టులకు క్యాష్ లెస్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించుకుంటే అక్రిడేషన్ కార్డులు కలిగిన జర్నలిస్టులతో పాటు వర్కింగ్ జర్నలిస్టులుగా పనిచేస్తున్న 5000 మందితో రాష్ట్ర సచి వాలయాన్ని టియుడబ్ల్యూజే 143 ఆధ్వర్యంలో ముట్టడిస్తా మని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కానీ మారుతి సాగర్ అన్నారు. బుధవారం మునుగోడు నియోజకవర్గ టియుడబ్ల్యూజే 143 వర్కింగ్ జర్నలిస్టులు మండలంలోని తుంగపాటి గౌరారం చలిదొన లక్ష్మీ నర సింహస్వామి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం సభ్యత్వ నమోదు సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై జర్నలిస్టులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి నల్లగొండ జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గాలెంక గురుపాదం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కా ర్యదర్శి ఆస్కానీ మారుతి సాగర్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ కార్డులు ఇవ్వా లని, ఇంటి స్థలాలను ఇవ్వాలని కోరారు. జర్నలిస్టుల అభివృద్ధి కోసం మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ గత ప్రభుత్వంతో పోరాడి సంక్షేమ నిధిని సాధించడం వల్ల సమస్యల వలయంలో ఉన్న అనేక జర్నలిస్టు కుటుంబాలకు యూనియన్ అండగా నిలిచిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టు సంక్షేమ నిధిని ఒక్క రూపాయి కూడా పెంచలేదని, ప్రస్తుత మీడియా అకాడమీ చైర్మన్ సంక్షేమ నిధి కోసం ఏమాత్రం ప్రయత్నించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. టియుడబ్ల్యూజే 143 నల్లగొండ జిల్లా అధ్యక్షులు గుండగోని జయశంకర్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ష్టాత్మకంగా చురుకుగా కొనసాగించాలని,ముందుగా మునుగోడు నియోజ కవర్గ సమావేశం నాంపల్లి మండ లంలో ఏర్పాటు చేయడం, అభి నందనీయమని కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కానీ మారుతి సాగర్ చేతులమీదుగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తెంజు రాష్ట్ర కార్యదర్శి ఏ రమ ణ, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు అవ్వారి భాస్కర్, ఐజేయు కౌన్సిల్ మెంబర్ తిరుపతి నాయక్, రాష్ట్ర నాయకులు వర్ది ల్లి వెంకన్న గౌడ్, యూనియన్ జి ల్లా ప్రధాన కార్యదర్శులు వీరస్వా మి, ఉప కార్యదర్శి శివప్రసాద్, యూనియన్ రాష్ట్ర నాయకులున్న బోయిన మట్టయ్య, గోలి వి జయ్, మునుగోడు యూనియ న్ ప్రధాన కార్యదర్శి కోడి రాములు, మునుగోడు నియోజకవర్గం ఉపాధ్యక్షులు కామ్ శెట్టి యాద య్య, మట్టయ్య, సీనియర్ పాత్రి కేయులు ఈద శేఖర్, నకిరేకల్ టి యుడబ్ల్యూజె నియోజకవర్గం నుంచి కొమ్ముగిరి, రమేష్, రామ సాయిలు, మిర్యాలగూడ నుంచి లక్ష్మణ్, మల్లె నాగిరెడ్డి, బొంగరా ల మట్టయ్య, దేవరకొండ నుంచి ఆంజనేయులు, నారాయణ, నల్లగొండ నుంచి పిల్లలమర్రి శ్రీ ని వాస్, మధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. టీయూడబ్ల్యూజే నాంపల్లి మండల శాఖ వెంకటేశ్వర్లు కార్యక్రమాన్ని ముందు వరుసలో ఉండి నడిపించారు. యూనియన్ నాయకులు కూర్పాటి శ్రావణ్ కుమార్, సిపెహ్ శ్రీను, గాలెంక వినోద్ కుమార్, పెద్దిరెడ్డి అనంత రెడ్డి, మర్రిగూ డెం మండల అధ్యక్ష కార్యదర్శు లు రమేష్, యాదయ్య, రఘు, మహేశ్వరం సతీష్, గట్టుప్పల మండలం నుండి గజం శ్రావణ్ కుమార్, కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ ఏకశిలా చలిదన లక్ష్మీ నరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఒట్టికోటి రవిని యూని యన్ శాలువా కప్పి సన్మానించారు.

# ఎల్-నినో నేపథ్యంలో కంది సాగుకు ప్రోత్సాహం


**- సబ్సిడీపై కంది విత్తనాలు**

**చింతలపాలెం, ఆగస్టు 6 (విజన్ ఆంధ్ర):** ప్రస్తుతం నెలకొన్న ఎల్-నినో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కరువును తట్టుకునే పిఆర్ జీ - 176 కంది విత్తనాలను చింతలపాలెం రైతు వేదికలో రైతులకు అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి శశాంక్ తెలిపారు. 130 - 135 రోజుల వ్యవధిలో పండే ఈ రకం కంది విత్తనం కరువు పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం కలిగి ఉండటంతో రైతులు ఈ రకాన్ని సాగు చేయాలని వ్యవసాయ శాఖ సూచించింది. ప్రస్తుతం చింతలపాలెం రైతు వేదికలో 100 బ్యాగుల (ప్రతి బ్యాగు 4 కిలోలు) విత్తన నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఒక్కో 4 కిలోల విత్తన బ్యాగు సబ్సిడీ అనంతరం 400 రూపాయల కు లభిస్తుందని అన్నారు. విత్తనాలు పొందేందుకు రైతులు పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. అదే విధంగా సాగు విస్తీర్ణానికి అనుగుణంగా మాత్రమే విత్తనాలు అందజేస్తామని తెలిపారు. చింతలపాలెం మండలం తో పాటు పరిసర గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శశాంక్ ఒక ప్రకటనలో కోరారు.

# ఏఈఓలకు పాత విధానంలోనే ఇన్-సర్వీస్ బీఎస్సీ ప్రవేశాలు ఇవ్వాలి

**5 శాతం ఇన్-సర్వీస్ కోటాను పూర్తిస్థాయిలో అమలు చేయాలని వినతి**

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 06(ప్రజాజ్యోతి):** ఇన్-సర్వీస్ బీఎస్సీ (అగ్రికల్చర్) ప్రవేశాల్లో పాత విధానాన్ని కొనసాగిస్తూ వ్యవసాయ విస్తరణ అధికారులను (ఏఈఓలు) సీనియారిటీ ప్రాతిపదికన ఎంపిక చేయాలని,ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం ఇన్-సర్వీస్ కోటాను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సూర్యాపేట జిల్లా ఏఈఓల సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్ర సెంట్రల్ ఫోరం పిలుపు మేరకు జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ)కి గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ,జి.ఓ.ఎం.ఎస్. నెం.250 (06-10-2009) స్ఫూర్తికి అనుగుణంగా డిప్లొమా అర్హత కలిగిన ఏఈఓలకు ఇన్-సర్వీస్ బీఎస్సీ (అగ్రికల్చర్)లో అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం వల్ల సీనియర్ ఏఈఓలు అవకాశాలు కోల్పోతున్నారని,దీంతో జి.ఓ. నెం.250 ఉద్దేశమే దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత విద్యా సంవత్సరంలో 31 మంది ఏఈఓలకు అవకాశం కల్పించగా,ఈ విద్యా సంవత్సరంలో కేవలం 19 సీట్లు మాత్రమే కేటాయించడం వల్ల అర్హులైన అనేక మంది నష్టపోతున్నారని పేర్కొన్నారు. కాబట్టి గతంలో అమలైన విధానాన్నే కొనసాగించి,5 శాతం ఇన్-సర్వీస్ కోటాను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా, ఏఈఓల సేవా ప్రయోజనాలు, ఉద్యోగోన్నతి అవకాశాలకు ప్రతికూలంగా ఉన్న జి.ఓ.ఎం.ఎస్. నెం.39ను వెంటనే రద్దు చేయాలని కూడా వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓ అనుబంధ సంఘం టీఏఈఓఏ జిల్లా అధ్యక్షుడు పెద్దపంగ ప్రణయ్, జిల్లా కార్యదర్శి డి. మనోజ్ కుమార్, జిల్లా ఖజానాదారు షేక్ ముస్తఫా, రాష్ట్ర సెంట్రల్ ఫోరం ఆర్గనైజింగ్ సెక్రటరీ కోడి మురళి, ఏఈఓలు శ్రీను, శైలజ, వెంకటేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



## చదువే ఆడపిల్లకు నిజమైన రక్షణ

### - జిల్లా మిషన్ కోఆర్డినేటర్ చైతన్య



**గరిడేపల్లి,ఆగస్టు 06(ప్రజా జ్యోతి):**
చదువే ఆడపిల్లకు నిజమైన రక్షణ అని జిల్లా మిషన్ కోఆర్డినేటర్ చైతన్య పేర్కొన్నారు.గురువారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి పి.ఎం.శ్రీ మోడల్ స్కూల్‌లో "బేటీ బచావో -- బేటీ పడావో"అవగాహన కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ డా,జె. ప్రసన్న కుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ, ఆడ పిల్లలు ఉన్నత విద్యను అభ్య సించి ఆర్థిక స్వాతంత్ర్యం సాధించే వరకు చదువును కొనసాగించాలని సూచించా రు.విద్యార్థినిలు సామాజిక మాధ్య మాలకు దూరంగా ఉండి,పుస్తకాలతో స్నేహం చేస్తేనే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోగలరని అన్నారు. అలాగే 18 ఏళ్ల లోపు బాలికలను వేధింపులకు గురి చేస్తే పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తప్ప వని,యువత చట్టాలను గౌరవించాలని పిలుపునిచ్చా రు.ఆర్థిక, సామాజిక సమానత్వం తోనే నిజమైన అభివృద్ధి సాధ్యమని,ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించే చైతన్యం పెరిగితేనే దేశం సమగ్ర అభివృ ద్ధి దిశగా ముందుకు సాగుతుందని అన్నారు.క్రమశిక్షణతో చదివి స్వయం సమృద్ధి సాధన దిశగా ముందుకు సాగాలని విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రసన్న కుమారి సూచించారు. అవకాశాల కోసం ఎదురు చూడొద్దు ప్రతిభతో అవకాశాలనే సృష్టించుకోండి అని ప్రహరీ కమిటీ వైస్ చైర్మన్ డా.కందుల శివకృష్ణ విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సతీష్‌కుమార్,వీరభద్రం,విష్ణువర్ధన్,దామ్లా,చిన్నబాలయ్య,వెంకటేశ్వర్లు, శాంతిప్రియ,మల్లికార్జున్ రెడ్డి, షాహిద్ అక్బర్,అనిల్,నాగుల మీరా,నవాబ్, భూలక్ష్మి,శేఖర్,ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మళ్ళీ తిరిగి మాతృ సంస్థ ఒడిలోకి

**నూతనకల్ ఆగస్ట్,06 (ప్రజాజ్యోతి):**
మాతృ సంస్థలో చేరిన ఇద్దరూ కామ్రేడ్లకు సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా సినియర్ నాయకులు పెద్దింటి రంగారెడ్డి, మండల కార్యదర్శి సుంకిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిల్పకుంట్ల గ్రామానికి చెందిన గడ్డం జానయ్య, జటంగి మల్లయ్య తిరిగి పార్టీలో చేరడం శుభసూచకము అని అన్నారు.. గతంలో వీరు పార్టీలో కీలక పాత్ర పోషించినారని కానీ కొన్ని అన్యాయ కారణాలవల్ల పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ తిరిగి పార్టీలో చేరుతున్నట్లు వారు వెల్లడించారు.. గ్రామంలో పార్టీ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుందని, పేద ప్రజల వైపే పార్టీ నిలుస్తుంది అని, గ్రామ సమస్యల పరిష్కారంలో పార్టీ ముందు వరుసలో నిలబడి పని చేస్తుందనే తిరిగి పార్టీలో చేరుకున్నట్లు జానయ్య మల్లయ్యలు వెల్లడించారు.. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ కార్యదర్శి దగ్గుల మల్లయ్య, పార్టీ గ్రామ సీనియర్ నాయకులు మందడి భూపాల్ రెడ్డి, దేసోజు మధు, ముండ్ల మల్లయ్య, కూసు ఉప్పలయ్య, చీమల సోమయ్య, కుసు లింగయ్య, బోలగాని రమేష్, బిక్కి రవి, జటంగి సతీష్, తోట్ల మలయ్య, మున్న సైదులు తదితరులు పాల్గొన్నారు...



# తెలంగాణ ఏర్పాటు లో సుష్మా స్వరాజ్ పాత్ర మరువలేనిది

### - బిజెపి రాష్ట్ర నాయకుడు సాధినేని శ్రీనివాసరావు

**మిర్యాలగూడ,ఆగస్టు 06, (ప్రజాజ్యోతి):**
ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మాజీ కేంద్రమంత్రి సుష్మా స్వరాజ్ పాత్ర మరువలేనిదని బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి సాదినేని శ్రీనివాసరావు అన్నారు.గురువారం మిర్యాలగూడ లోని ఒకటో పట్టణ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ చిన్నమ్మగా పేరుగాంచిన మాజీ కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ 7వ, వర్ధంతి సందర్భంగా సాగర్ రోడ్డు లో ఆమె చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పార్లమెంట్‌లో తన వాగ్ధాటితో, పోరాట పటిమతో జాతీయ ప్రజాస్వామ్య కూటమి భాగస్వామ్య పక్షాలను ఏకతాటిపైకితీసుకువచ్చి, తెలంగాణ రాష్ట్ర సాధనకు విశేష కృషి చేసిన మహనీయ నాయకురాలు సుష్మా స్వరాజ్ అని కొనియాడారు. తెలంగాణ కోసం విద్యార్థులు మరిన్ని బలిదానాలు చేయాల్సిన అవసరం లేదని,తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ ఫలితాలను ప్రజలే అనుభవించాలని ఆమె పార్లమెంట్‌లో చేసిన ప్రసంగాలు చారిత్రాత్మకమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో ఆమె చేసిన



సేవలను ఈ నేల ఎన్నటికీ మరువదని, తెలంగాణ ప్రజల తరపున ఆమెకు ఘన నివాళులుఅర్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒకటో పట్టణ అధ్యక్షుడు బంటుగిరి, ప్రధాన కార్యదర్శి కొంగరి వెంకటరమణ, ఉపాధ్యక్షులు చిలుకూరి వెంకటేశ్వర్లు, మోదాల అశోక్, మహిళా మోర్చా అధ్యక్షురాలు గోనే కవితా రెడ్డి, నక్క రవి, మునగాల శివ, సీనియర్ నాయకులు రేపాల పురుషోత్తం రెడ్డి, తల్లం అశోక్, చిలుకూరి శామ్, నాగుబండి విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు వెలుగు నాగరాజు, మంద శివ, తదితరులు పాల్గొన్నారు.

# పాటతో చైతన్యం తీసుకువచ్చిన ప్రజా గాయకుడు గద్దర్

**మిర్యాలగూడ, ఆగస్టు 06,( ప్రజాజ్యోతి ):**
పాటలతో ప్రజలను చైతన్యం చేసిన గొప్ప ప్రజా గాయకుడు గద్దర్ అని సామాజికవేత్త డాక్టర్ జాడీ రాజు అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణం లోని డాక్టర్ జాడీ రాజు అధ్యక్షతన ప్రజాయుద్ధ నౌక గద్దర్ మూడవ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జాడిరాజు మాట్లాడుతూ తన మాటల ద్వారా పాటల ద్వారా యావత్ భారత దేశంలో అన్ని రాష్ట్రాల తిరుగుతూ ప్రజలను చైతన్యం చేస్తూ తాడిత పీడిత వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన మహా నేత గద్దర్ అని కొనియాడారు అలాగే మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రతి గ్రామం తిరుగుతూ



ప్రజలను చైతన్యం చేసి తెలంగాణ రావడానికి ముఖ్యపాత్ర పోషించిన గద్దర్ కి భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు మాదుగుల శ్రీనివాస్,మాల మహానాడు నల్గొండ జిల్లా అధ్యక్షుడు బొప్పని నగేష్,రాష్ట్ర కమిటీ నాయకులు చిలుకూరి అభినవ్, నకిరేకంటి కిరణ్,బీసీ సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు దాసరాజు జయరాజ్, బాల బోయిన దేవదానం, సామ కోటయ్య, కాకునూరి రమేష్, చింతోజు రత్నాచారి, గద్దర్ అభిమానులు పాల్గొన్నారు.

# అదనపు పిపీ బాలకృష్ణకు ఆత్మీయ మిత్రుల సన్మానం

**హుజూర్ నగర్ ఆగస్ట్ 06 (ప్రజా జ్యోతి):**
హుజూర్‌నగర్ కోర్ట్ కు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులైన సీనియర్ న్యాయవాది కుక్కడపు బాలకృష్ణను గురువారం ఆత్మీయ మిత్రబృందం అధ్వర్యంలో ఘనంగా శాలువ గజామాలతో సన్మానం చేశారు. కోర్ట్ ను ఆశ్రయించే సబ్బండ వర్గాల ప్రజలకు సత్వర న్యాయ సేవలు అందించాలని భవిష్యత్ లో కుక్కడపు బాలకృష్ణ మరిన్ని ఉన్నత పదవులు అందుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సబ్ ఇన్స్పెక్టర్ దొంతగాని నాగేశ్వరరావు, రేపాకుల మురళీ దుగ్గి బ్రహ్మం, రేపాకుల కోటయ్య, చిలకరాజు లింగయ్య అజయ్ కుమార్, వడ్లాణపు గురవయ్య, దుగ్గి ఉపశ్రీ చిక్కుళ్ళ గోవింద్ ఇందిరాల



రామకృష్ణ రేపాకుల నరసింహ, రామకృష్ణ, వడ్లాణపు రామకృష్ణ చిలకరాజు సైదులు దుగ్గి వేణు, కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పాశం సత్తి రెడ్డి పుట్టినరోజు వేడుకలు

**నార్కట్ పల్లి, ఆగస్టు 6 ( ప్రజా జ్యోతి ):**
నకిరేకల్నియోజకవర్గం బి ఆర్ స్ నాయకులు పాశం సత్తిరెడ్డి పుట్టినరోజున సందర్భంగా నిరుపేదల ఆకలి నిలయం అయిన మనం స్వచ్చంద సంస్థ ఆధ్వర్యంలో 517 రోజున, నిరుపేదలకు బాటసారులకు నిస్సహాయులకు భిక్షాటన చేసే వారికి వందమంది అభాగ్యులకు మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.గత 12 సంవత్స రాలుగా జనం మధ్యన ఉండి ప్రజాసమస్యలను తెలుసుకునే వ్యక్తి,ఎవ్వరు ఆపద లో



వున్నా ఆదుకునే వ్యక్తి,ఏదవెల్లి సత్తి రెడ్డి తను మాట్లాడుతూ... ఈ సంస్థ ను ఎన్నో రోజులగా చూస్తున్న ప్రతిరోజు 100మందికి ఉచిత భోజనంని అందించటం చాలా గోప్ప విషయం, భగవంతుని రూపం ఎంతో నిష్ఠ నిబద్దత కలిగినవ్యక్తి ద్దైద నాగరాజు. ఈ సంస్థ కు నేను నా వంతు సహాయ సహకారాలు అందిస్తాను అని తెలిపారు. నా పుట్టినరోజు ఇక్కడ ఇంత మంది నిరుపేదల ఆకలిలో జరుపుకోవడం చాలా సంతోషకరంగామైన విషయం ఇది అని తెలిపారు. కార్యక్రమంలో రావుల శ్రీను, బైరోజు విశ్వారూప చారీ,రూపాని సాయి బాబా, జానీ రెడ్డి, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ్ ఆశలకు తూట్లు

- రూ.1,648 కోట్ల మహాత్మా గాంధీ లిఫ్ట్ పనుల్లో నాణ్యతపై అనుమానాలు - వర్షాలకు బయటపడిన పైపు లైన్
- పైపుల్లోకి వెళ్ళిన మట్టి.. బురద - నాణ్యత లోపాలు సరి చేస్తామన్న ఈఈ సత్యనారాయణ



**చింతలపాలెం, ఆగస్టు 6 (ప్రజా జ్యోతి):** నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని వెల్లటూరు వద్ద కృష్ణానదిపై రూ.1,648 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మహాత్మా గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కాంట్రాక్టర్లు, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో నాణ్యత లోపాలు బయటపడు తున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా చింతలపాలెం, మేళ్లచెరువు, మట్టంపల్లి మండలాల్లోని సుమారు 53 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు 19,295 కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. ఇటీవల కురిసిన వర్షాల అనంతరం నిర్మాణం జరుగుతున్న పలు ప్రాంతాల్లో భూమిలో పూడ్చిన భారీ పైపులు బయటపడటం, పైపుల చుట్టూ మట్టి కుంగి పోతున్నాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం పాత వెల్లటూరు నుంచి సింగారం వరకు సుమారు 21 కిలోమీటర్ల మేర రెండు వరుసల్లో భారీ పైప్‌లైన్ నిర్మాణం కొనసాగుతోంది. **పొలం మొత్తం దెబ్బతింది - రైతు వీరంరెడ్డి సైదిరెడ్డి:** ఈ సందర్భంగా రైతు వీరంరెడ్డి సైదిరెడ్డి మాట్లాడుతూ, పైప్‌లైన్ పనులు పూర్తైన తర్వాత పలుమార్లు మట్టిని సక్రమంగా నింపి లెవెలింగ్ చేయాలని అధికారులు, కాంట్రాక్టర్ ప్రతినిధులను కోరినా పట్టించుకోలేదని రైతు వీరంరెడ్డి సైదిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు తన పొలంలోని సారవంతమైన నల్లమట్టి మొత్తం కొట్టుకుపోయి పైప్‌లైన్ గుంతలోకి చేరిందని, దీంతో పొలం తీవ్రంగా దెబ్బతిందని తెలిపారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రైతుల కష్టాలు తీర్చాలని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ పథకం కాంట్రాక్టర్ల, అధికారుల నిర్లక్ష్యంతో నాణ్యత లోపాలు బయటపడుతున్నాయని విమర్శిస్తు న్నారు. **ఇరిగేషన్ శాఖ స్పందన:** ఈ అంశంపై ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణను సంప్రదించగా, ప్రస్తుతం పైప్‌లైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నందున పైప్‌లైన్‌ను ఇంకా పూర్తిగా పూడ్చలేదని తెలిపారు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి, బురద పైప్‌లైన్‌లోకి వెళ్లిందని చెప్పారు. పనులు పూర్తయ్యే దశలో పైప్‌లైన్‌లోకి చేరిన మట్టి, బురదను పూర్తిగా తొలగించి, సాంకేతిక ప్రమాణాలకు అనుగు ణంగా అన్ని నాణ్యతా పరీక్షలు నిర్వహించి ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి ఏఐటీయూసీ



**మఠంపల్లి, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి):** మఠంపల్లి మండల కేంద్రంలో ఏఐటీయూసీ అనుబంధ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల మహాసభ గురువారం ఎర్రవెల్లి శాంతకుమారి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభకు ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి త్రిపురం సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో విధులు నిర్వహిస్తున్నారని, వారికి ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని కోరారు. ఎన్నో పోరాటాల ఫలితంగా ప్రస్తుతం కేవలం రూ.3,000 మాత్రమే వేతనం అందుతోందని, ఈ స్వల్ప వేతనంతో కుటుంబాలను పోషించడం అసాధ్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వంట కార్మికులకు రూ.10,000 వేతనం అందిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు బీమా సౌకర్యం కల్పించి సామాజిక భద్రత కల్పించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథక నిర్వహణ కోసం కార్మికులు అప్పులు చేసి విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నప్పటికీ, ప్రభుత్వం బిల్లులను సకాలంలో చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోడిగుడ్లు, నిత్యావసర సరుకులు, గ్యాస్‌ను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలని, ప్రతి విద్యార్థికి మిడ్డే మీల్ ఛార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ రన్ మియా, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల నాయకులు ఎర్రవెల్లి శాంతకుమారి, భూక్య ముత్యాలు, కాటేపల్లి పుష్ప, పాశం భద్రమ్మ, సత్తర్పు వెంకటేశ్వర్లు, మంగమ్మ, కె.సాలమ్మ, రాజ్యలక్ష్మి, ఎం.పద్మ, ఎం.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బి ఆర్ ఎస్ ఆఫీసులో ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు



**మిర్యాలగూడ, ఆగస్టు 06, ( ప్రజాజ్యోతి ):** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ 92వ జయంతిని మిర్యాలగూడ పట్టణం లోని బిఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్ రావు, తిప్పిన విజయసింహారెడ్డి ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికిపూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆచార్య జయశంకర్ సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ఆవిర్భావానికి ఆయన అందించినసిద్ధాంతపరమైన మార్గదర్శకత్వం, ఉద్యమానికి ఇచ్చిన దిశానిర్దేశం ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికిచాటిచెప్పిన మహనీయుడిగా జయశంకర్ సార్ చరిత్రలోనిలిచిపోతారనిఅన్నారు. ఆయనఆశయాలకుఅనుగుణం గా తెలంగాణఅభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. యువత జయశంకర్ సార్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, దుర్గంపూడి నారాయణరెడ్డి, నల్లమోతు సిద్ధార్థ, జొన్నలగడ్డ రంగారెడ్డి, ధనావత్ చిట్టిబాబు నాయక్, చౌగాని బిక్షం గౌడ్, అమరావతి సైదులు, ఎండి మగ్దూం పాషా, పెద్ది శ్రీనివాస్ గౌడ్, ఎండి. మజీద్ , పాలుట్ల బాబయ్య, ఆంగోతు హాతీరాం నాయక్, ఎండి. షోయబ్ , ఎర్రమళ్ళ దినేష్ , ధనావత్ బాలాజీ నాయక్, శిరసనగండ్ల ఈశ్వర్ చారి, పిసికే ప్రసాద్, పెండ్యాల పద్మ, ధూళిపాల కళావతి, కోదాటి రమ, పిన్న బోయిన శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వగ్రామంపై మమకారం

- సీసీ కెమెరాలకు రూ.2.50 లక్షలు
- పాఠశాలకు రూ.1.25 లక్షల విలువైన డిస్క్ బెంచీలు
- ఆంజనేయస్వామి ఆలయానికి ఆర్థిక సహాయం
- సేవా దృక్పథాన్ని కొనియాడుతున్న గ్రామస్తులు



**నూతనకల్.. ఆగస్టు 06 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని పెద్దనేమిల గ్రామానికి చెందిన ఈగ ప్రసన్నకుమార్ స్వదేశంలో స్థిరపడి, తాను జన్మించిన గ్రామ అభివృద్ధికి తనవంతు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే స్పందిస్తూ, పరిష్కారానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామంలో శాంతిభద్రతలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ చురుకంటి లావణ్య మధుసూదన్‌రెడ్డి కోరగా, ఈగ ప్రసన్నకుమార్ వెంటనే స్పందించి రూ.2.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ నిధులతో గ్రామంలోని ప్రధాన కూడళ్లు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టనున్నారు. దీంతో గ్రామంలో భద్రత మరింత మెరుగుపడటంతో పాటు నేరాల నియంత్రణకు కూడా దోహదం కానుందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. విద్యకు ప్రాధాన్యత ఇస్తూ పెద్దనేమిల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కోసం రూ.1.25 లక్షల వ్యయంతో డిస్క్ బెంచీలను అందజేశారు. దీంతో విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించే అవకాశం కలిగింది. అంతేకాకుండా గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి 50,000 ఆర్థిక సహాయం అందించి తన ఆధ్యాత్మిక సేవాభావాన్ని చాటుకున్నారు. గ్రామాభివృద్ధి, విద్య, ప్రజా భద్రత, ఆధ్యాత్మిక రంగాల్లో ఆయన అందిస్తున్న సహకారం అభినందనీయమని గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కొనియాడుతున్నారు. స్వగ్రామం పట్ల మమకారం, సమాజానికి తిరిగి సేవ చేయాలనే తపనతో ముందుకు సాగుతున్న ఈగ ప్రసన్నకుమార్ సేవలు మరెందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు.

## ఫోటో వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

-సంఘం సభ్యుల సంక్షేమానికి కృషి

**హుజూర్ నగర్ ఆగస్ట్ 06 (ప్రజా జ్యోతి):** హుజూర్‌నగర్ మండల ఫోటో & వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా జక్కుల మురళి, ప్రధాన కార్యదర్శిగా బాడిశ వీరేష్, కోశాధికారిగా తురక సందీప్, కుటుంబ భరోసా ఇన్‌చార్జ్‌గా జడ సాయి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి సూర్యాపేట ఫోటో & వీడియోగ్రఫీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లాలు, వర్కింగ్ ప్రెసిడెంట్ చేపూరి లక్ష్మణ్, కోశాధికారి చిన్న లాలు, రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదగిరి, రాష్ట్ర సభ్యులు రామ్‌శెట్టి కృష్ణ, కుటుంబ భరోసా ఇన్‌చార్జ్ రవి, జిల్లా ఉపాధ్యక్షులు హరికృష్ణతో పాటు వివిధ మండలాల అధ్యక్షులు హాజరై నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించి అభినందించారు. సంఘం సభ్యుల సంక్షేమానికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.



## తెలంగాణ భావజాల ప్రాపకుడు ఆచార్య జయశంకర్



**హాలియా,ఆగస్టు6(ప్రజా జ్యోతి) :** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని హాలియా మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ రాజా రమేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితాంతం తెలంగాణ ఆత్మగౌరవం కోసం తపించిన మహనీయుడని అన్నారు.మలి దశ ఉద్యమానికి సిద్ధాంత భూమిక ను ఏర్పర్చి దశాబ్దాల కల సాకారం అయ్యే దిశగా ప్రజా చైతన్యాన్ని అక్షర రూపంలో,ఉపన్యాస వేదికలపై పదునెక్కించిన దార్శనికుడు అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి కౌన్సిలర్లు చెరుపల్లి ముత్యాలు, కౌన్సిలర్ సలహాదారులు చిట్టిప్రోలు కరుణాసాగర్, మజహర్ మొహినుద్దీన్, ఎడవల్లి రంజిత్,కడమంచి శ్రీను, కో ఆప్షన్ సభ్యులు చెన్ను రాజేశ్వరి,వర్కాల శేఖర్ రెడ్డి, మహమ్మద్ రషీద్,మున్సిపల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## సిరికొండ పాఠశాలకు మైక్ సెట్ బహుకరణ



**మోతె ఆగస్టు 6 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని సిరికొండ జడ్పీహెచ్ఎస్ స్కూల్లో పూర్వ విద్యార్థులైన ఎస్ఎస్సీ--2000 బ్యాచ్ సభ్యులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారంగా రూ.10 వేల విలువైన మైక్ సెట్‌ను పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమం మండల ఎంఈఓ కె. గోపాల్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించబడింది.ఈ సందర్భంగా ఎంఈఓ కె. గోపాల్‌రావు మాట్లాడుతూ....పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు భాగస్వాములు కావడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా పాఠశాల అభివృద్ధికి అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎన్. రాము, జి. నగేష్, సరిత, బి. వీరభద్ర పాల్గొన్నారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, శ్రీను, రమేష్, గోవర్ధన్ రెడ్డి, మల్లీశ్వరి, సాజిత్, సురేష్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## దూదిమెట్ల బాలరాజు త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

**నకిరేకల్ .ఆగస్టు 6. ప్రజా జ్యోతి :** నకిరేకల్: మాజీ గోట్స్ అండ్ షీప్స్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో, ఆయన త్వరగా కోలుకోవాలని కోరుతూ పాలెం గ్రామంలో దీ=ూం నకిరేకల్ మండల నాయకులు ఏకుల గణేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని బాలరాజు సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని మొక్కుకున్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన విద్యార్థి ఉద్యమంలో దూదిమెట్ల బాలరాజు ఎనలేని సేవలు అందించారని ఏకుల గణేష్ పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో ఆయన చేసిన సేవలు, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని అన్నారు. బాలరాజు త్వరగా కోలుకుని ప్రజా సేవలోకి తిరిగి రావాలని ఆకాంక్షించారు.

# ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



**మఠంపల్లి, ఆగస్టు 6 (ప్రజా జ్యోతి):** తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మేధోబలంగా నిలిచిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ 92వ జయంతి వేడుకలను గురువారం మఠంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్ సార్ తన జీవితాన్ని అంకితం చేశారని, ఆయన చూపిన మార్గం తెలంగాణ సమాజానికి శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన మేధోబలం,దూరదృష్టి రాష్ట్ర ఆవిర్భావానికి బలమైన పునాదిగా నిలిచాయని కొనియాడారు.తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ జయశంకర్ సార్ ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.యువత ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొంది సమాజ సేవలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీరామ్ నవీన్, సూపరింటెంట్ కృష్ణవేణి,టైపిస్ట్‌మణికుమార్,కార్యదర్శులు,ప్రజాప్రతినిధులు,రాజకీయ నాయకులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, యువజన సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యంతో చెలగాటం వద్దు.. కాలుష్య మిల్లుపై చర్యలు తీసుకోండి



**గరిడేపల్లి,ఆగస్టు 06(ప్రజా జ్యోతి):** గరిడేపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో ఉన్న సునంద రైస్ ఇండస్ట్రీ నుంచి వెలువడుతున్న కాలుష్యం,శబ్దం ధూళి,దుర్వాసనలు ప్రజల ఆరోగ్యానికి,ప్రాణాలకు ముప్పు గా మారాయని,సంబంధిత అధికార యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని మండల ఎంఆర్పీఎస్,జైభీమ్ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు.ఈ విషయమై గతంలోనే వందమంది గ్రామస్తుల సంతకాలతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటి వరకు కాలుష్య నియంత్ర ణ మండలి అధికారులు ఎలాంటి విచారణ చేపట్టలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం కొనసాగిస్తే ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.మిల్లు కార్యకలాపాలకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించాలని కోరుతూ సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద గరిడేపల్లి ఎంపీడీవోకు దరఖాస్తు అందజేసినట్లు తెలిపారు.ప్రజల ఆరోగ్య భద్రత విషయంలో ప్రభుత్వం, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ మండల కోఆర్డినేటర్ కుర్రి వెంకన్న,గ్రామ అధ్యక్షులు పిట్ట వెంకటేష్,నకిరేకంటి రవి,ఆలం పల్లి శేఖర్,కొత్తపల్లి పవన్, బచ్చలకూరి నాగార్జున,పిట్ట నాగరాజు,మచ్చ ఆదాం తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ.. ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బలమైన పునాది

**- జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గుండు రామాంజి గౌడ్**



**గరిడేపల్లి,ఆగస్టు 06(ప్రజా జ్యోతి):** తల్లిపాలే శిశువుకు తొలి టీకా, తొలి రక్షణ అని,ప్రతి తల్లి ప్రసవం జరిగిన గంటలోపే బిడ్డకు తల్లిపాలు పట్టించాలని సూర్యాపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు,రాయని గూడెం సర్పంచ్ గుండు రామాంజి గౌడ్ పిలుపునిచ్చారు.గురువారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం రాయిని గూడెం గ్రామంలోని ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు--1,2లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశువు పుట్టిన తర్వాత మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే అందించాలని, తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారంతో పాటు రోగనిరోధ క శక్తికి మూలాధారమని తెలిపారు.తల్లిపాల వల్ల తల్లి, బిడ్డ ఇద్దరికీ రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు.తల్లిపాలను ప్రోత్సహించి,బంగారు భవిష్యత్తును నిర్మిద్దాం అని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సునీత,అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ,నాగమణి,అంగన్‌వాడీ ఆయాలు,తల్లిదండ్రులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు



**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 06 (ప్రజాజ్యోతి):** మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శకుడైన కొత్తపల్లి జయశంకర్ జయంతి జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన ఎంపీడీఓ విజయ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల సూపరింటెండెంట్ సత్యనారాయణరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొని జయశంకర్ సేవలను స్మరించారు.

# జీపీ కార్మికుల హక్కుల కోసం పోరాటం తప్పదు

**- సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్.కే.యాకూబ్**



**గరిడేపల్లి,ఆగస్టు 06(ప్రజా జ్యోతి):** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ జీపీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం గరిడేపల్లి ఎంపీడీవోకు సరోజకి సమ్మె నోటీసు అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్.కే.యాకూబ్ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి జీపీ కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు రావాల్సిన బకాయిలను కేంద్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు.అలాగే మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి,జీపీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పీఆర్సీ అమలు చేయాలని, అర్హులైన జీపీ కార్మికులను పంచాయతీ కార్యదర్శులు, కరోబార్లుగా నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ నెల 14న జరిగే ఉద్యమ కార్యక్రమం లో జీపీ కార్మికులు అధిక సంఖ్య లో పాల్గొని కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో జీపీ కార్మిక సంఘం కార్య దర్శి అంబరవరపు శ్రావణ్ కుమార్,బండ వెంకటరెడ్డి, మచ్చ వీరస్వామి,రాజు,నల్లాల సైదులు,వెంకటాచారి,కొండ సైదులు తదితరులు పాల్గొన్నారు .

# .తల్లిపాలే బిడ్డకు తొలి రక్షణ.. జీవితాంతం ఆరోగ్యానికి బలమైన పునాది

**-అంగన్వాడీ టీచర్ పోకల వెంకమ్మ**



**గరిడేపల్లి,ఆగస్టు 06(ప్రజా జ్యోతి):** తల్లిపాలే బిడ్డకు తొలి రక్షణ.. జీవితాంతం ఆరోగ్యానికి బలమైన పునాది అని అంగన్వాడీ టీచర్ పోకల వెంకమ్మ అన్నారు.గురువారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గానుగబండ గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ పోకల వెంకమ్మ మాట్లాడుతూ, తల్లిపాలను మించిన దివ్య ఔషధం బిడ్డకు మరొకటి లేదని అన్నారు.పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించడం,ఆరు నెలల వయస్సు వచ్చే వరకు కేవలం తల్లిపాలే ఇవ్వడం వల్ల బిడ్డలో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగా ఎదుగుతాడని తెలిపారు.గర్భిణీలు గర్భధారణ సమయంలో ఆకుకూరలు, కూరగాయలు వంటి పోషకాహారం తీసుకుంటే తల్లితో పాటు గర్భంలోని శిశువు కూడా ఆరోగ్యంగా ఉంటాడని వివరించారు.తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ పోషకాహారమే కాకుండా,తల్లీబిడ్డల మధ్య ప్రేమ,ఆప్యాయత,మమతానుబంధాలను మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు అమరారపు సత్యవతి, తాళ్ల అనిత,ఆయాలు గోవింద మ్మ,నాగమణి,గర్భిణీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల కోసం రోటరీ క్లబ్ చేయూత అభినందనీయం

**- ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ శ్రీ సరస్వతి శిశు మందిర్ కు 1.50 లక్షల విలువగల ఆట సామాగ్రి అందజేత**



**మిర్యాలగూడ, ఆగస్టు 06,( ప్రజాజ్యోతి ):** విద్యార్థుల కోసం రోటరీ క్లబ్ చేయూత అభినందనీయం అని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) అన్నారు. మిర్యాలగూడ శ్రీ సరస్వతీ శిశు మందిర్ లో చదువుతున్న విద్యార్థుల కోసం రోటరీ క్లబ్ వారు పాఠశాల కోసం 50 బెంచిలతో పాటు తో పాటు లక్ష 50 వేల విలువగల ఆట వస్తువులను అందించడంఅభినందనీయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ లో రోటరీ క్లబ్ సహకారంతో అందించిన ఆట వస్తువులను రోటరీ క్లబ్ అధ్యక్షుడు మా శెట్టి శ్రీనివాస్ తో కలిసి పాఠశాల ప్రబంధ కారిణి అధ్యక్షుడు గౌరు దయాకర్ కు అందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ దాతలు ఇచ్చిన సహకా రంతో విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ విద్యార్థులుగా ఎదగాలన్నారు.నైతిక విలువ లతో కూడిన విద్యను అందించడంతోపాటు సామాజికఅవగాహనను పెంపొందించే శ్రీసరస్వతీ శిశు మందిరాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాజకీయాలకతీతంగా పాఠశాల అభివృద్ధి కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి చిలుకూరు బాలు,కాంగ్రెస్ నాయకులు గుడిపాటి నవీన్, ఇమ్రాన్ కౌన్సిలర్లు ఇంద్ర కుమార్ రోటరీ క్లబ్ సభ్యులు విశ్వనాథ్, సిమ్రాన్ మైనీ, అశోక్ కుమార్, మాశెట్టి వీరయ్య, రేపాల అంతయ్య, సుదర్శన్ తో పాటు ఇన్నర్ వీల్ సభ్యులు మాశెట్టి భాగ్యలక్ష్మి, రేపాల వాసవి, గౌరు సీత, శ్రీ సరస్వతి శిశు మందిర్ సభ్యులు మురహరి, అనంతరెడ్డి, యామిని వెంకటేశ్వర్లు, గూడూరుశ్రీనివాసరావు, బండారు ప్రసాద్, తిప్పన వెంకటేశ్వర్ రెడ్డి, రంగారావు, జగన్ శర్మ, తోపాటుహెడ్మాస్టర్ చెన్నూరు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఆదర్శ నాయకుడు కొంగరి భాస్కర్‌కు ఘన నివాళులు



**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 06 (ప్రజాజ్యోతి):** పురపాలక పరిధిలోని ముక్తాపూర్ గ్రామంలో మాజీ జడ్పీటీసీ, పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వ్యవస్థాపక చైర్మన్ స్వర్గీయ కొంగరి భాస్కర్ 9వ వర్ధంతి వేడుకలను విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్థానిక కౌన్సిలర్లు శ్రీరామ్ మంజుల లింగస్వామి, కొండమడుగు ఎల్లస్వామి ముఖ్య అతిథులుగా హాజరై భాస్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు కొంగరి భాస్కర్ సమాజ సేవలను స్మరించుకుని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొంగరి కృష్ణ, మాజీ సర్పంచులు దారెడ్డి మల్లారెడ్డి, కొండమడుగు మైసయ్య, మునుకుంట్ల భానుచంద్రం, విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ చైర్మన్ కొండమడుగు మల్లేశం, అరుణోదయ యువజన సంఘం అధ్యక్షుడు కొండమడుగు స్వామి, మాజీ ఉపసర్పంచులు కొండమడుగు మల్లయ్య, రుద్ర భిక్షపతి, దారెడ్డి దామోదర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు, అరుణోదయ యువజన సంఘం, పవర్ యువజన సంఘం సభ్యులు, రాజకీయ నాయకులు, కమిటీ సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాలకీడు మండలంలో మరో ఆణిముత్యం

**గేట్ లో 46వ ర్యాంక్ సాధించిన సందీప్ యాదవ్**



**పాలకవీడు, ఆగష్టు 6(ప్రజా జ్యోతి ):** పాలకవీడు మండలం, ఎల్లాపురం గ్రామానికి చెందిన మధ్య తరగతి వ్యవసాయ కుటుంబానికి చెందిన బొడ్డు వెంకటేశ్వర్లు, ధనమ్మ దంపతుల కుమారుడు బొడ్డు సందీప్ యాదవ్ తన అసాధారణ ప్రతిభతో ఐ ఐ టి ఇండోర్, మధ్యప్రదేశ్ చదివి తెలుగు రాష్ట్రాలకు గర్వకారణంగా నిలిచాడు.ఇటీవల వెలువడిన గేట్ ఇంజనీర్ నియామక ఫలితాల్లో అఖిల భారత స్థాయిలో 46 ర్యాంక్ సాధించి, (నేషనల్ హైవే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్)డిప్యూటీ మేనేజర్ (టెక్నికల్)న్యూఢిల్లీ సాధించి అందరి ప్రశంసలు అందుకున్న బొడ్డు సందీప్ యాదవ్ తాజాగా వెలువడిన నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా నియామకాల్లో డిప్యూటీ మేనేజర్ పదవికి ఎంపికై ( పోస్టింగ్ చిత్తూరు ఆంధ్రప్రదేశ్) మరో ఘన విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు.చిన్ననాటి నుంచే చదువుపై అపారమైన ఆసక్తి, క్రమశిక్షణ, కష్టపడే తత్వంతో ముందుకు సాగిన బొడ్డు సందీప్ యాదవ్ ఐఐటీ..సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి, కేవలం 24 ఏళ్ల వయసులోనే ఈ అరుదైన విజయాలను సాధించడం నిజంగా యువతకు స్ఫూర్తిదాయకం.తన విజయాల వెనుక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ప్రేరణ, బొడ్డు సందీప్ యాదవ్ వినయంగా పేర్కొనడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనం.మట్టిలో పుట్టిన మాణిక్యంలా మెరిసిన బొడ్డు సందీప్ యాదవ్,తండ్రి చిన్నతనంలో చనిపోయిన తాతగారు,నాయనమ్మ బొడ్డు లింగయ్య, సాయమ్మ , అమ్మ ప్రోత్సాహంతో విజయం సాధించినారు.మరెన్నో శిఖరాలను అధిరోహించాలని, భవిష్యత్తులో సివిల్ ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్, సివిల్ సర్వీస్ లాంటి సాధించి దేశానికి మరింత సేవ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ,యరగొర్ల కాశీ యాదవ్ బామ్మర్ది ని అభినందిచి శుభాకాంక్షలు తెలియజేశారు.పల్లె నుంచే ప్రతిభ పుడుతుంది... కృషి ఉంటే కలలు నిజమవుతాయి అని నిరూపించారు.

# పెద్దకాపర్తి మత్స్య సహకార సంఘం చైర్మన్‌గా నూతి వెంకటేశం

**నకిరేకల్. ఆగస్టు 6. ప్రజా జ్యోతిః**



నకిరేకల్: చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ మత్స్యశాఖ సహకార సంఘం (సొసైటీ) నూతన చైర్మన్‌గా ఎన్నికైన నూతి వెంకటేశం, నూతన డైరెక్టర్లను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సత్కరించి నూతన పాలకవర్గానికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్, డైరెక్టర్లు సమన్వయంతో పనిచేస్తూ సొసైటీని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. మత్స్యకారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని, వారి సంక్షేమానికి అంకితభావంతో సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మత్స్యశాఖ సహకార సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వర్షం వస్తే నరకయాతనే... పేరబోయినగూడెం ప్రజల ఆవేదన

**- దెబ్బతిన్న ప్రధాన రహదారితో నిత్యం ఇబ్బందులు- గుంతల్లో నిలిచిన నీటితో ప్రమాదాలకు ఆహ్వానం**

**- వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి**

**నాగారం ఆగస్టు 06 ప్రజా జ్యోతిః**





నాగారం మండలంలోని పేరబోయినగూడెం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి అధ్వాన్నంగా ఉండటంతో నిత్యం ప్రయాణించే రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, గ్రామ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో రహదారిపై ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారుతోంది. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతుండగా, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వంటి వాహనాలు గ్రామానికి చేరుకోవడమే కష్టసాధ్యంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్యను వివరించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. కనీసం గుంతలను పూడ్చే పనులు కూడా చేపట్టకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల డిమాండ్‌రహదారిని తక్షణమే మరమ్మతు చేసి, శాశ్వతంగా అభివృద్ధి చేయాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# సేవతో చిరస్థాయిగా గోరే జానీ జ్ఞాపకం

**.-ఏఆర్ హాస్పిటల్ సహకారంతో ఖదీర్,ఫరీద్ సేవా కార్యక్రమం**

**-సేవాభావం సమాజానికి ఆదర్శం గుడుగుంట్ల గోవర్ధన్**




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 06(ప్రజాజ్యోతి):**

తల్లిదండ్రుల జ్ఞాపకాలను కేవలం ఫోటోలకే పరిమితం చేయకుండా,సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో చిరస్థాయిగా నిలబెట్టడం గొప్ప సంస్కృతి. అదే ఆలోచనతో పట్టణంలోని ఖదీర్ ఫ్లెక్సీ ప్రింటింగ్ నిర్వాహకులు తమ తండ్రి స్వర్గీయ గోరే జానీ జ్ఞాపకార్థం 28వ వార్డు ప్రజల కోసం గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఖదీర్ ఆర్ట్స్ ప్రింటర్స్ నిర్వాహకులు ఖదీర్,ఫరీద్ ఆధ్వర్యంలో,ఏఆర్ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడుగుంట్ల గోవర్ధన్ మాట్లాడుతూ,ఖదీర్ ఫ్లెక్సీ ప్రింటింగ్ సంస్థ ఎన్నో ఏళ్లుగా నాణ్యమైన సేవలతో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. తమ తండ్రి జ్ఞాపకార్థం ప్రజల ఆరోగ్యానికి ఉపయోగపడే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం ఆదర్శప్రాయమైన సేవా కార్యక్రమమని కొనియాడారు. **సేవతోనే తల్లిదండ్రులకు నిజమైన నివాళిః**తల్లిదండ్రుల జ్ఞాపకాలను సేవా కార్యక్రమాల ద్వారా సజీవంగా ఉంచడం సమాజానికి స్ఫూర్తినిస్తుందని గోవర్ధన్ పేర్కొన్నారు. కంటి సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స పొందేందుకు ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఖదీర్,ఫరీద్ మాట్లాడుతూ, తమ తండ్రి స్వర్గీయ గోరే జానీ సేవా స్ఫూర్తిని కొనసాగించాలనే సంకల్పంతో ప్రతి సంవత్సరం ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన ఏఆర్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మన్సూర్ ఆర్ట్స్, లతీఫ్ ఆర్ట్స్ ప్రతినిధులు, ఆర్టిస్ట్ అసోసియేషన్ సభ్యులు, ఖదీర్ ఫ్లెక్సీ ప్రింటింగ్ సిబ్బంది, స్థానికులు,28వ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు సంపూర్ణ పోషణ



**నకిరేకల్ ఆగస్టు 6 ప్రజా జ్యోతిః**

నకిరేకల్: అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని నకిరేకల్ మండల స్థాయిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ ఆశ్ర అంజూ మేడం ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి నకిరేకల్ ఎంపీడీఓ బ్రహ్మాచారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బ్రహ్మాచారి మాట్లాడుతూ.. శిశువులకు తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవని, తల్లిపాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయని తెలిపారు. గ్రామస్థాయిలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు సమన్వయంతో పనిచేస్తూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు భవాని, రాధిక, నాగమణి, ప్రదం ఎన్జీవో ప్రతినిధులు స్రవంతి, సంధ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం ఆశ తదితరులు పాల్గొన్నారు.

# పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలి

**-తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారం**

**-సర్పంచ్ గుగులోతు రవీందర్ నాయక్**

**-లక్ష్మాపురంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు**

**-గర్భిణీలు, బాలింతలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం**



**నాగారం ఆగస్టు 06 ప్రజా జ్యోతిః**

పుట్టిన బిడ్డకు తల్లిపాలే తొలి టీకా, సంపూర్ణ ఆహారమని, జననం వెంటనే ముర్రుపాలు పట్టించడం ద్వారా శిశువుకు రోగనిరోధక శక్తి పెరిగి అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని లక్ష్మాపురం గ్రామ సర్పంచ్ గుగులోతు రవీందర్ నాయక్ అన్నారు. గురువారం నాగారం మండలం లక్ష్మాపురం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి తల్లి బిడ్డకు జననం జరిగిన వెంటనే ముర్రుపాలు అందించాలని, తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. అనంతరం ఏఎన్ఎం శైలజ గర్భిణీలు, బాలింతలకు ముర్రుపాల ప్రాముఖ్యత, శిశు సంరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించారు. తల్లిపాల వల్ల తల్లి, బిడ్డ ఇద్దరి ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పాముకుంట్ల వెంకన్న, పంచాయతీ కార్యదర్శి దూదిగాని శివ, అంగన్వాడీ టీచర్ మల్లెపాక కవిత, ఆశా కార్యకర్త మల్లెపాక శోభారాణి, ఏఎన్ఎం ఆఫ్రిన్, వీబీకే మల్లెపాక వెంకటయ్య, మల్లెపాక గిరి, గర్భిణీలు, బాలింతలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ యోధులు జయశంకర్ గద్దర్ ల సేవలు మరువలేనివి

**జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతి సందర్భంగా చిత్రపటాలకు పూలమాలవేసి ఘన నివాళులు**
**- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**






**నల్గొండ ఆగస్టు 6,(ప్రజా జ్యోతి ):**
నల్గొండలోని ఇందిరా భవన్‌లో గురువారం నిర్వహించిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గద్దర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి కూడా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని, ఎస్ఎల్‌బీసీతో పాటు కీలక ప్రాజెక్టులను పూర్తి చేసి తెలంగాణను సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, గుమ్మల మోహన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి ప్రజల నుంచి విజ్ఞాపనలు స్వీకరించారు.



# తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి ప్రొఫెసర్ జయశంకర్ దిశానిర్దేశం

**జయశంకర్ ఆశయాలను ఆచరణలో పెట్టి ప్రజలకు సేవ చేయాలి**
**92వ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 06(ప్రజాజ్యోతి):**
తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త, ఉద్యమ మేధావి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ రాష్ట్ర సాధన కోసం ప్రజలను, నాయకత్వాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చి తెలంగాణ ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజాసేవలో మరింత బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.హరిసింగ్‌తో కలిసి కలెక్టర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల హక్కులు, నీళ్లు, నిధులు, నియామకాల కోసం ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం పోరాటం చేశారని అన్నారు. ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఉద్యమాలతో పాటు సాహిత్యాన్ని కూడా ఆయుధంగా మలుచుకున్నారని పేర్కొన్నారు. స్థానిక యువతకు స్థానిక ఉద్యోగాలు లభిస్తేనే ప్రాంతం సమగ్ర అభివృద్ధి చెందుతుందనే భావనతో ఆయన నిరంతరం కృషి చేశారని చెప్పారు. ప్రజలను ఐక్యం చేసి తెలంగాణ ఉద్యమానికి స్పష్టమైన దిశానిర్దేశం చేసిన జయశంకర్ ఆలోచనలు నేటికీ ఆదర్శప్రాయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేసి విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాల్లో ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాలని సూచించారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సమిష్టిగా కృషి చేయాలని, సమాజంలో శాశ్వత మార్పు తీసుకురావడానికి ఉద్యోగులంతా ఒక బృందంగా పనిచేసి సూర్యాపేట జిల్లాను రాష్ట్రంతో పాటు దేశంలోనూ ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. జిల్లా అదనపు కలెక్టర్ బి.హరిసింగ్ మాట్లాడుతూ, మలి తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ పోషించిన పాత్ర చారిత్రాత్మకమని అన్నారు. తెలంగాణ వనరులు తెలంగాణ ప్రజలకే దక్కాలనే లక్ష్యంతో ఆయన ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఆ మహనీయుడి సేవలను తెలంగాణ సమాజం ఎప్పటికీ మరవకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్‌రాజ్, సీపీఓ కిషన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, డీపీఓ యాదగిరి, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, జిల్లా ట్రెజరీ అధికారి రవికుమార్, ఇన్‌చార్జి పరిపాలన అధికారి శ్రీలతతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పులిమామిడి మాజీ సర్పంచ్ అలుగుబెల్లి వెంకట్‌రెడ్డికి ఘన నివాళి



**నల్గొండ టౌన్ ఆగస్టు 6,(ప్రజా జ్యోతి ):**
మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దుప్పలపల్లి రోడ్డులో ఉన్న శ్రీ శుభం కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన పులిమామిడి మాజీ సర్పంచ్, మాజీ కౌన్సిలర్ అలుగుబెల్లి వనజాత భర్త అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి దశదిన కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరయ్యారు. వెంకట్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి, అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, మాజీ జెడ్పీటీసీలు గుమ్ముల మోహన్‌రెడ్డి, వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్, కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం



**గూడూరు ప్రజా జ్యోతి ఆగస్టు 6**
పోలీస్ స్టేషన్ పరిధిలోని భూపతిపేట గ్రామం నుండి బొదుగొండ గ్రామం వరకు జాతీయ రహదారిపై తరచూ రోడ్డు రిపేర్ చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు నేడు సీఐ గూడూరు ఆధ్వర్యంలో, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (వీఎ×) . డిప్యూటీ ఇంజనీర్, నేషనల్ హైవేస్ సంయుక్తంగా ప్రమాదకర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు అధికంగా సంభవిస్తున్న ప్రాంతాలను గుర్తించి, వాటికి గల కారణాలను విశ్లేషించారు. ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు, స్పీడ్ నియంత్రణ చర్యలు, రోడ్డు భద్రతా మార్కింగ్‌లు, రిఫ్లెక్టర్లు, అవసరమైన ఇంజనీరింగ్ మార్పులు తదితర అంశాలపై సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని కార్యాచరణ ప్రణాళిక (ూషఁఱశీఅ ాశ్రీఁఅ) సిద్ధం చేయాలని నిర్ణయించారు. అదేవిధంగా గూడూరు సెంటర్‌లో ట్రాఫిక్ పరిస్థితిని పరిశీలించి, ట్రాఫిక్ రద్దీని తగ్గించి రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రౌండబౌట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించి, సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల సమన్వయంతో సమర్థవంతమైన చర్యలు చేపట్టి ప్రజలకు సురక్షిత ప్రయాణ వాతావరణం కల్పించేందుకు గూడూరు పోలీసులు కట్టుబడి ఉన్నారని గూడూరు సీఐ తెలిపారు.